రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ నేతల అరెస్ట్ అప్రజాస్వామికం ■ రైతులకు మద్దతు తెలుపకుండా గులాబీ నేతల హౌస్ అరెస్ట్ ■ ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు

రామచంద్రాపురం: బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

సిర్గాపూర్: పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

కోహీర్: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నేతలు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 19: కాంగ్రెస్ సర్కార్ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య ఆరోపించారు. రైతుల ప్రజాభవన్ ముట్టడికి బీఆర్ఎస్ నాయకులు వెళ్తారని పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఆర్సీపురం డివిజన్‌లోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ కృష్ణకాంత్‌ని ఆర్సీపురం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కాంగ్రెస్ సర్కార్ సగం మంది రైతులకు రుణమాఫీ చేసి చేతులు దులుపుకొందని, కాంగ్రెస్ సర్కార్ రైతులకు, ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ కృష్ణకాంత్ ఉన్నారు.

సిర్గాపూర్‌లో..

సిర్గాపూర్, సెప్టెంబర్ 19: ప్రజా భవన్ ముట్టడికి వెళ్లనున్న బీఆర్ఎస్ నాయకులను గురువారం సిర్గాపూర్‌లో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారిని ఏఎస్ఐ రవీందర్‌గౌడ్ బైండోవర్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లతో చేస్తున్న పోరాటానికి అక్రమ అరెస్టు అడ్డుకాదన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదవరావు, రవీందర్, రాజాగౌడ్, బస్వరాజ్, అంజాగౌడ్, రహీమాన్, రమేశ్, వాలునాయక్, గంగారం, ధర్మానాయక్, రాంసింగ్, ధౌర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ నేతల అరెస్టెందుకు?

కోహీర్, సెప్టెంబర్19: రూ.రెండు లక్షల రుణమాఫీ కోసం రైతులు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిస్తే తమను ఎందుకు అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీ కోసం ప్రజాభవన్ ముట్టడికి బీఆర్ఎస్ పిలుపు ఇవ్వలేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఎనిమిది నెలలుగా అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. తెల్లవారుజామున తమ ఇండ్లకు వచ్చి అనవసరంగా బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారన్నారు. ప్రజాభవన్ ముట్టడికి వెళ్తామని ఎవరైనా తప్పుడు సమాచారం అందించారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎప్పుడూ రైతుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, సంపత్‌కుమార్, సందీప్‌కుమార్, కరణ్‌కుమార్, ప్రశాంత్, శ్రీకాంత్, రజనీకాంత్, రమేశ్, తుల్జరాం, భరత్ ఉన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, సెప్టెంబర్ 19: రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో రైతుల ప్రజాభవన్ ముట్టడిని దృష్టిలో ఉంచుకొని గురువారం నారాయణఖేడ్‌లో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. రవీందర్‌నాయక్, ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, ఎంఏ బాసిత్, గంగారాం, అమ్ర్యానాయక్, రాజునాయక్, రాజు, శ్రీకాంత్, పండరి, పరశురాంరెడ్డిని అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు.

రామచంద్రాపురం: మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ కృష్ణకాంత్‌ని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నారాయణఖేడ్: పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కంది: వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

ఓటరు జాబితాపై విస్తృత సమీక్ష

వచ్చే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటరు జాబితాపై గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశమయ్యారు. ఎంపీడీవో కార్యాలయాల్లో నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు తుది ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఝరాసంగంలో బీఆర్ఎస్ నాయకులను పిలవకుండా అధికార కాంగ్రెస్‌కు ఆహ్వానం పంపడంపై మండల అధ్యక్షుడు వెంకటేశం మండిపడ్డారు. ఎంపీడీవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 19

ఘనంగా 'మిలాద్ ఉన్ నబీ'

సంగారెడ్డి: పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 19

బ్లాస్టింగ్ దాటికి అమరవీరుల స్తూపం ధ్వంసం

జిన్నారం, సెప్టెంబర్ 19: బ్లాస్టింగ్ దాటికి అమరవీరుల స్తూపం ధ్వంసం కావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని మాదారం గ్రామంలోని అమరవీరుల స్తూపం సమీపంలో కంకర క్వారీల్లో అధిక సామర్థ్యంతో చేపట్టిన బ్లాస్టింగ్‌లు చేయడంతో అమరవీరుల స్తూపం గ్రానేట్ ఉడిపోయింది. దీంతో స్థానిక మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, విద్యార్థి జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, స్థానికులు పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానికంగా ఉన్న కంకర క్వారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధ్వంసమైన అమరవీరుల స్తూపాన్ని పరిశీలిస్తున్న మాదారం గ్రామస్తులు

నాయకులు భగవాన్‌సింగ్, దశరథ్, విజయ్‌గౌడ్, గణేశ్, సుదర్శన్, రమేశ్, అనిల్, నర్సింగ్‌రావు, సంపత్ ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 19: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకున్నప్పుడే లక్ష్యానికి చేరుకుంటారని ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని మయూరినగర్‌లోని గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై వెళ్లిన, బదిలీపై కళాశాలకు వచ్చిన ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే ఉద్దేశంతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 మందితో ప్రారంభమైన ఈ కళాశాలలో 1,020 మంది విద్యార్థులకు విద్యాబోధన అందుతుందని తెలిపారు. కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ ఎంతో కృషి చేశారని అభినందించారు. కళాశాలకు నూతనంగా వచ్చిన సిబ్బంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను సమకూరుస్తామని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేశ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కుమార్‌గౌడ్, అంజయ్య, జగన్నాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, లింగయ్య, దిలీప్‌సింగ్, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేంద్రాచారి, ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌ను సన్మానిస్తున్న ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, పక్కన కార్పొరేటర్ పుష్పా, ఆదర్శ్‌రెడ్డి

మాదిగలకు 12% రిజర్వేషన్లు కల్పించాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 19: ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలని, జనాభా నిష్పత్తి ప్రకారం 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. గురువారం పట్టణానికి చేరుకున్న మాదిగల మేలుకొలుపు యాత్రలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రభుత్వం కమిటీ వేయడం హర్షణీయమన్నారు. 30 ఏండ్ల క్రితం పెట్టిన రిజర్వేషన్లను ఇప్పుడు అమలు చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో మాదిగల మేలుకొలుపు యాత్ర ఉంటుందన్నారు. మాదిగలు, లంబాడీలు, మాలలు, ముదిరాజులకు మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ఈ నెల 30న భువనగిరిలో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ యాత్రలో తెలంగాణ మాదిగల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య, మాజీ జడ్పీ సభ్యులు మోహన్ రవి, జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నాయకులు బండి మోహన్, అరుణ, వీరేందర్, ఉపేందర్, సురేశ్, జోగా రావు, సాయన్న, జోగు గణేశ్, కళాకారులు పడిమర్తి రాంబాబు, గడ్డల రమేశ్, వజిత్, గణేశ్ పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూ.. రూ.12 లక్షలు

బొల్లారం, సెప్టెంబర్ 19: గణపతి ప్రసాదం సొంతం చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని నమ్మిన భక్తులు పెద్ద సంఖ్యలో వేలంపాటలో పాల్గొన్నారు. గురువారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని పాత బొల్లారం గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా వేలంపాటలో పాల్గొన్న స్థానికుడు పులగుర్ల ఎల్లారెడ్డి రూ.12 లక్షలకు లడ్డూ దక్కించుకున్నాడు. అదే గణపతి కరెన్సీ మాలను రూ.6 లక్షల 8 వేలకు మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డిగారి అనిల్‌కుమార్ రెడ్డి దక్కించుకున్నాడు. అనంతరం గణేశుడిని శోభాయాత్రగా తీసుకెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

లడ్డూతో పులగుర్ల ఎల్లారెడ్డి

విశ్వశాంతికి మృత్యుంజయ మహా యజ్ఞం

పూర్ణాహుతిలో ఆశ్రమ అర్చకులు, పీఠాధిపతులు, భక్తులు

ఝరాసంగం, సెప్టెంబర్ 19: మృత్యుంజయ మంత్ర సహస్ర మహాయజ్ఞ ప్రభావంతో కలుషితమైన వాతావరణం పరిశుభ్రమవుతుందని, దీని ప్రభావం 100 కిలోమీటర్ల వరకు ఉంటుందని ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో విశ్వశాంతి, లోక కల్యాణార్థం మృత్యుంజయ మహా యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన యజ్ఞం పూర్ణాహుతి, మహా మంగళహారతితో ముగిసింది. ప్రతి నెలా పౌర్ణమి మరుసటి రోజు ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యజ్ఞంలో శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి, నాగరాజ్ శాస్త్రీ హాజరయ్యారు. విశ్వ మానవ ఆధ్యాత్మిక పరిషత్ సభ్యులు రాచయ్య స్వామి, నీలా వెంకటేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉజ్వల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఇతర పార్టీల నాయకులు హాజరయ్యారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జిన్నారం, సెప్టెంబర్ 19: జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్‌శక్తి ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో జిన్నారంలోని కస్తూర్బా బాలికా విద్యాలయంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ప్రతినిధి యాదగిరి, జిన్నారం మెడికల్ అధికారి కోమలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చౌటకూర్, సెప్టెంబరు 19: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి యశోద, లింగమయ్య దంపతుల ఏకైక కుమారుడు శంకర్(21) తాడ్దానిపల్లి శివారులోని టోల్‌ప్లాజాలో పని చేస్తున్నాడు. శంకర్ చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడటంతో తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ ఏదో ఒక పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం విధులకు హాజరై సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చిన శంకర్ రాత్రి గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్దకు వెళ్లాడు. చెప్పులు, మొబైల్ ఫోన్ కట్టపై ఉంచి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం తల్లి వెతకగా చెప్పులు, ఫోన్ చెరువు కట్టపై ఉండటాన్ని గమనించింది. మత్స్యకారుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంకర్ (ఫైల్)

కేంద్ర చట్టాలతో కార్మికులకు అన్యాయం

కోహీర్, సెప్టెంబర్19: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలతో తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో చట్టాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. నాలుగు చట్టాల అమలుతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం సీతారాం ఏచూరీకి సంతాపం ప్రకటించారు. సమావేశంలో క్లస్టర్ అధ్యక్షుడు మహిపాల్, రాజిరెడ్డి, మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

కొండాపూర్, సెప్టెంబర్ 19: గురుకుల పాఠశాల విద్యార్థుల డైట్ చార్జీలు పెంచాలని, అశాస్త్రీయ పనివేళలు మార్చాలని గురువారం గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్-గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు సుదర్శన్, ఖైరత్ అలీ, లాలు, అంజనేయులు, నర్సింగరావు, పండరి, ఉదయ్, శేఖర్, వెంకట్, రాజు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిర్మాపూర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 19: డీఎస్సీ నియామకాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో వలంటీర్లను నియమించడంతో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కమ్మరి దత్తాత్రి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లో టీపీయూఎస్ నారాయణఖేడ్ డివిజన్ స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి మల్లికార్జున్, ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, చంద్రశేఖర్, లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షుడు చంద్రకాంత్, మండలాల బాధ్యులు మశ్చందర్, ఓంబసవ, సతీశ్, కిరణ్, రఘు, జగదీశ్, రతన్‌సింగ్, సుదర్శన్, విష్ణు, భూమయ్య పాల్గొన్నారు.

ముత్తంగిని స్వచ్ఛతలో ముందుంచుతాం

పటాన్‌చెరు, సెప్టెంబర్ 19: ముత్తంగిని స్వచ్ఛతలో ముందుంచుతామని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ పురపాలక సంఘం ముత్తంగి వార్డు కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారి నవోద్ రెడ్డి, శేఖర్, తెల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ అధికారి పవన్‌కుమార్, అంగన్‌వాడీ ఆయాలు, వైద్యులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాల తొలిగింపు

బొల్లారం, సెప్టెంబర్ 19: పరిసరాల శుభ్రతే తమ లక్ష్యమని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మాధవానికుంటలో గణేశ్ నిమర్జన వ్యర్థాలను తొలిగించారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడొద్దని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్పీ సావిత్రి, సూపర్‌వైజర్ హరీశ్ ఉన్నారు.

రైతు హక్కుల సాధనకు కృషి

మాట్లాడుతున్న జిల్లా రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు బాల్‌రాజ్

న్యాల్‌కల్, సెప్టెంబర్ 19: రైతు హక్కుల సాధనకు కృషి చేస్తామని జిల్లా రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని హద్నూర్ గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా సురేందర్, కార్యదర్శులుగా గుండారెడ్డి, రహుల్, చిన్న, కార్యవర్గ సభ్యులు మాణిక్‌రెడ్డి, మస్తాన్, మల్లన్న, రాములు, వలీయోద్దీన్, జయరాజ్, కనకరాజు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజీయొద్దీన్ మక్సుద్ అలీ, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సమీయొద్దీన్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సింథోకెమ్‌లో కార్మికుడి ఆత్మహత్య

పటాన్‌చెరు, సెప్టెంబర్ 19: పాశమైలారం పారిశ్రామికవాడలోని సింథోకెమ్ పరిశ్రమలో కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పటాన్‌చెరులోని చిట్కుల్ గ్రామంలో నివసించే జనార్దన్‌రావు(42)ది స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా జోగిపాడు గ్రామం. 14 ఏండ్లుగా స్థానికంగా సింథోకెమ్ లాబ్స్‌లో ఆర్‌వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం సెకండ్ షిఫ్టుకోసం డ్యూటీకి వెళ్లి తిరిగిరాలేదు. రాత్రి 10 గంటలకు కూడా ఇంటికి రాకపోవడంతో ఓటీ చేస్తున్నాడని భార్య విజయ భావించింది. గురువారం 6.30 గంటలకు కంపెనీ నుంచి జనార్దన్‌రావు ఉరి వేసుకొని చనిపోయాడని ఫోన్ వచ్చింది. కంపెనీకి వెళ్లిన విజయకు సెక్యూరిటీ, సిబ్బంది ఆత్మహత్యకు గల కారణాలను వివరించారు. కంపెనీలో తెల్లవారుజామున 4.30కి బైక్‌పై జనార్దన్‌రావు బయటకు వెళ్లేందుకు రాగా సెక్యూరిటీ చెక్ చేశారు. వాహనంలో కంపెనీ తాలూకు వస్తువులు దొరకడంతో సెక్యూరిటీ సిబ్బంది నిలదీయంతో మనస్తాపం చెందిన జనార్దన్‌రావు కంపెనీ క్యాంటీన్ పైకి వెళ్లి మెడకు తాడు కట్టుకుని కిందికి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త మరణంలో ఎలాంటి అనుమానం లేదని విజయ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పటాన్‌చెరు, సెప్టెంబర్ 19: బండ్లగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పరిశీలించారు. గురువారం పటాన్‌చెరు జీహెచ్ఎంసీ డివిజన్‌లో బండ్లగూడ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ కాలనీల్లో పర్యటించారు. కాలనీలో వర్షం నీరు నిలుస్తున్నదని పలువురు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన తక్షణమే కాంట్రాక్టర్‌ను పిలిచి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హత్నూర, సెప్టెంబర్ 19: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం మంగాపూర్ శివారులో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం చిన్నకంజర్లకు చెందిన మన్నె శివకుమార్(45) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నివాసం ఉంటున్న రెండోభార్య దగ్గరకు రాత్రి 11గంటల సమయంలో బైక్‌పై వెళ్తుండగా మంగాపూర్ శివారులోకి చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని పోలీసులు 108వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

ఉపాధి పనులపై ఆడిట్

సిర్గాపూర్, సెప్టెంబర్ 19: మండలంలోని రూప్లాతండా పంచాయతీలో గురువారం ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించామని ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్ తెలిపారు. ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో డీఆర్‌పీ కొలతలు తీసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై పనుల వివరాలు తెసుకున్నారు. కూలీల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సమస్యలను ఆడిట్ సిబ్బంది నమోదు చేసుకున్నారు.

పరిసరాల శుభ్రతకు పాటుపడాలి

అందోల్, సెప్టెబంర్ 19: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి కోరారు. గురువారం అందోల్- జోగిపేట పరిధిలోని చెరువుల్లో వినాయకుల నిమజ్జనాల సందర్భంగా పేరుకుపోయిన చెత్తను శుభ్రచేయించడంతోపాటు వార్డుల్లో పరిసరాలను పరిశీలించారు. క్రమంతప్పకుండా పరిసరాలను శుభ్రంచేస్తూ మంచి నీటి సరఫరాను కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు సైతం వ్యక్తిగత పరిశుభ్రత